క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనారాయణ కల్యాణం



ఉభయదారులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న మేనేజర్ వెంకటేష్

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనారాయణకు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతులైన లక్ష్మీనారాయణ స్వామివారికి పట్టువస్త్రాలు పూలహారతులతో అలంకరణ చేసి అర్చకులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ కల్యాణోత్సవం వైభవం భక్తులు దర్శించుకున్నారు. చిత్తూరులోని సంతపేటకు చెందిన నాగేంద్ర దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పూజలకు విచ్చేసి భక్తులకు ఉభయదారుల నాగేంద్ర దంపతులు ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేష్ రెడ్డి, ఆలయ అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి పలువురు భక్తులు పాల్గొన్నారు.

పేదల ఆస్పత్రిలో తాగునీటి కష్టాలు



తిరుపతి తుడా: రాయలసీమకి తలమానికమైన శ్రీవెంకటేశ్వర రుయా ఆస్పత్రిలో రోగులకు, వారి సహాయకులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. దాతల సహాయంతో జల ప్రసాదం ద్వారా తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. ఈ జల ప్రసాదంలో తాగునీరు సరిగ్గా రాకపోవడంతో ఆస్పత్రికి వచ్చేవారు దాహార్తితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాహానికి పక్కనే ఉన్న దుకాణాల్లో డబ్బులు పెట్టి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం జల ప్రసాదం వద్ద రోగుల సహాయకులు క్యూలో నిలబడి తాగునీరు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆస్పత్రిలో ప్రతి చోటా కనీస అవసరమైన తాగునీరు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

21న పౌర్ణమి అఖండ ధ్యానం

తవణంపల్లె: మండలంలోని విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో ఈనెల 21న శుక్రవారం పౌర్ణమిరోజు అఖండ ధ్యాన సదస్సు జరుగుతుందని జిల్లా పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. పౌర్ణమి పురస్కరించుకుని రాత్రి 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఆధ్యాత్మిక ఆత్మ జ్ఞానసదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని ధ్యానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కాణిపాకం: నెల్లూరు జిల్లాకు చెందిన నరేందర్ రెడ్డి ఆదివారం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదానానికి రూ.1,00,116లను విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు దాత, కుటుంబసభ్యులకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. సిబ్బంది వాసు, విగ్నేష్ పాల్గొన్నారు.

ఆంధ్రా విద్యార్థి సంఘం నేతగా అఖిల్

చిత్తూరు కార్పొరేషన్: ఆంధ్రా విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కొంగారెడ్డిపల్లెకు చెందిన అఖిల్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం తాడేపల్లిగూడెంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ తురక ప్రసాద్ ఏకగ్రీవంగా ప్రకటించారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన తురకప్రసాద్‌కు అఖిల్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తానన్నారు.

వైభవం.. మహాకుంభాభిషేకం



మహాముసీశ్వర ఆలయం వెలుపల భక్తులు



కుంభాభిషేక వేడుకలకు హాజరైన భక్తులు



ఆలయం వద్ద అన్నదానం

● మహా మునీశ్వరున్ని దర్శించుకున్న భక్తులు

నగరి: పట్టణంలోని కళింమిట్ట వేల్‌నగర్‌లో నిర్మించిన మహామునీశ్వర ఆలయంలో కుంభాభిషేక వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం మహా పూర్ణాహుతి పూజలనంతరం కుంభాభిషేక సంబంధిత ప్రధాన కలశాన్ని మంగళవాయిద్యాల నడుమ ప్రదక్షిణగా తీసుకువచ్చారు. గర్భాలయ విమాన కలశానికి, పరివార ఆలయాల శిఖరాలకు కుంభాభిషేకం చేశారు. కుంభాభిషేకం జలం కోసం భక్తులు పోటీపడ్డారు. శిఖరంపైకి వెళ్లి కలశాలపై పుష్పాలను చల్లి మొక్కుకున్నారు. అనంతరం గర్భాలయంలోని మహామునీశ్వర స్వామికి మహాభిషేకం చేశారు. అభిషేకాన్ని వీక్షించడానికి భక్తులు బారులు తీరారు. అనంతరం మహామునీశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి కర్పూర హారతులు ఇవ్వగా భక్తులు దర్శించుకున్నారు.

భారీగా అన్నదానం..

కుంభాభిషేక ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కుంభాభిషేక ఉత్సవాలకు విచ్చేసిన భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పడిపోతున్న తోతాపురి



మార్కెట్‌లో తోతాపురి కాయలు

బంగారుపాళెం: స్థానిక మామిడి మార్కెట్‌లో తోతాపురి (బెంగళూర)రకం మామిడి ధరలు రోజురోజు కు పతనం అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. మార్కెట్ ప్రారంభంలో తోతాపురి రకం ధర ఆశాజనకంగా ఉండేదన్నారు. టన్ను రూ.28 వేల వరకు పలికిందన్నారు. ప్రస్తుతం టన్ను రూ.22 వేలు ఉందన్నారు. ప్రారంభ ధరతో పోల్చుకుంటే టన్నుకు రూ.6 వేలు నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. ఫ్యాక్టరీకి తరలించే కాయలు టన్ను రూ.25 వేల వరకు పలుకుతోందన్నారు. దిగుబడి బాగుంటే, గిట్టుబాటు ధరలేకపోవడం, ధర ఆశాజనకంగా ఉంటే పంట దిగుబడిలేకపోవడం వంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. ఈ ఏడాది తోటల్లో పూత సకాలంలో రాకపోవడంతో పాటు ఆలస్యంగా వచ్చిన పూత రాలిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిందని అంటున్నారు. ఎకరాకు మూడు టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉండగా నేడు టన్ను కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. నైరుతి రుతుపవనాల కారణంగా ఈదురుగాలులతో కూడిన వర్షం అడపాదడపా పడుతుండడంతో ఉన్న కాయలు నేలరాలిపోతున్నాయన్నారు. రానున్న రోజుల్లో ధర పెరుగుతుందని ఆశిస్తున్నట్లు రైతులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, మేదిని పూజ అనంతరం పుట్ట మట్టిని సేకరిస్తున్న వేదపండితులు

పుత్తూరు: అప్పలాయగుంటలోని టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. తోమాలసేవ, కొలువు నిర్వహించారు. స్వామివారిని పట్టుపీతాంబరాలు, వజ్ర వైడూర్యాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు పుట్ట మట్టితో మేదిని పూజ చేపట్టారు. అనంతరం సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా శ్రీవిష్వక్సేనుల వారు నాలుగు మాడవీధుల్లో విహరించి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. తర్వాత యాగశాలలో వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. రాత్రి 8.30 గంటలకు శుద్ధి, ఏకాంత సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6.55 గంటల నుంచి 7.25 గంటల మధ్య ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రమేష్, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం..

బ్రహ్మోత్సవాలను తిలకించడానికి విశేష సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగువల్లులు, విద్యుత్ దీపకాంతులతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు వేశారు. తొమ్మిది రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలతో అప్పలాయగుంటలో పండుగ వాతావరణం నెలకొంది.

గ్రామదేవతకు విశేష పూజలు



పాలసముద్రం: మండలంలోని సింహరాజుపురంలో గ్రామ దేవతకు, టీవీఎస్‌ఆర్‌పురంలో అమ్మకాలి కాంబ అమ్మవారికి ఆదివారం గ్రామస్తులు వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అలయ అర్చకులు అమ్మవార్లను ఉదయం పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి అంబలి ఊరేగించి అమ్మవారి ఆలయాన్ని మూడుసార్లు చుట్టి అమ్మవారికి సమర్పించారు. భక్తులు తీసుకొచ్చిన పూజాసామగ్రితో అమ్మవార్లను సుందరంగా అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు.



సింహరాజుపురంలో అంబలిని ఊరేగింపుగా తెస్తున్న మహిళలు, (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తెలుగు పండితులకు మాధవరెడ్డి ఆదర్శం



మాధవరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు, శిష్యులు, ఉపాధ్యాయులు

కార్వేటినగరం: తెలుగు పండితులకు ఆదర్శం మాధవరెడ్డి అని పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రాజు అన్నారు. ఆదివారం ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాలలో మాధవరెడ్డి పదవీ విరమణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ తెలుగు పండితులుగా విధినిర్వహణ నిర్వహిస్తూ ఎందరో విద్యార్థులను తెలుగు పండితులుగా మార్చి వారి జీవితాలను ఉన్నతస్థాయికి చేర్చిన ఘనత మాధవరెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం ఓరియంటల్ కళాశాల ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు పండితులుగా తెలుగు భాషకు ఊపిరి పోస్తూ, తెలుగు పండితులకు మాధవరెడ్డి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. డీఎస్సీల్లో అత్యుత్తమ శిక్షణ అందించి ఉమ్మడి రాష్ట్రంలో వందల మందిని తెలుగు పండితులుగా మార్చిన ఘనత, ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు, రివార్డులు అందుకున్న ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. అనంతరం ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో విద్యాబోధనలు అందించిన మాధవరెడ్డి తమ వద్ద విధులు నిర్వహించి తమ చేతుల మీదుగా పదవీ విరమణ చెందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ క్రమంలో భాగంగా ఆయన వద్ద శిక్షణ పొంది తెలుగు పండితులుగా ఉద్యోగాలు సాధించిన శిష్యబృందం మాధవరెడ్డి దంపతులను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాడు–నేడు పనులలో భాగంగా పాఠశాల అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని ఎంఈఓ వసుమతీదేవి అన్నారు. ఈ క్రమంలో భాగంగా పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మాధవరెడ్డి దంపతులను శాలువలు కప్పి గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్రస్థాయి నాయకుడు గాజుల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉమాశంకర్, తులసీబాబు, జనార్దన్, వేణు, నాగేంద్రబాబు, నిరంజని, కుసుమ, తిరుమలేశన్, దిలీప్, తులసీరాం, గీత, పూర్ణిమ, సుజాత పాల్గొన్నారు.

రుయాలో కుక్కల బెడద



పేదలకు ఆరోగ్య దేవాలయంగా పేరుగాంచిన రుయా ఆసుపత్రిలో కుక్కలు వీరంగం చేస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఎంతో అవస్థలు పడి పేద రోగులు, వారి సహాయకులు రోజూ రుయా ఆసుపత్రికి చేరుకుంటున్నారు. అయితే రుయా ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ, జనరల్ వార్డ్ తదితర ప్రాంతాల్లో కుక్కలు తిరుగుతున్నాయి. రోగులు, వారి సహాయకులు, డాక్టర్ల, నర్సులు వెంట పడుతున్నాయి. అయితే సంబంధిత అధికారులు సిబ్బంది వాటిని వెళ్ళగొట్టే చర్యలు చేపట్టకపోవడంతో ఆస్పత్రిలో ఇబ్బందులు తప్పడం లేదు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ధ్యానంతో ప్రశాంతమైన జీవితం



ధ్యాన కార్యక్రమాల సమరం జీవామృతం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ వీజీఓ బాలిరెడ్డి, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ధ్యానాన్ని మించిన పుణ్యఫలం అందించేది మరొకటి లేదని, ధ్యానం పవిత్ర గంగానదిలో స్నానం చేసినంత ఫలితాన్ని ఇస్తుందని టీటీడీ వీజీఓ బాలిరెడ్డి తెలిపారు. తిరుపతి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో దశ పాప హర దశమి సందర్భంగా మూడు రోజులుగా ప్రకాశం రోడ్డులోని ఎస్వీ ధ్యాన మందిరంలో నిర్వహించిన ధ్యాన జ్ఞాన యజ్ఞం కార్యక్రమం ఆదివారం సాయంత్రంతో ఘనంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి టీటీడీ వీజీఓ బాలిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇంటిలోనే ధ్యానం చేయడం ద్వారా పది రకాల పాపాలను దూరం చేసుకోవచ్చని తెలిపారు. ధ్యానులు మాత్రమే ప్రశాంతమైన జీవితాన్ని గడపగలరని తెలిపారు. అనంతరం ఆయన ధ్యాన కార్యక్రమాల సమరం జీవామృతం పుస్తకాన్ని ఆవిష్కరించారు. తర్వాత తిరుపతి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు కంచి రఘురామ్ మాట్లాడుతూ గురూజీ బ్రహ్మర్షి పత్రీజీ ఆశయం మేరకు 2024 నవంబర్ 11వ తేదీ ఆయన జయంతిని పురస్కరించుకొని నగరంలో తిరుపతి సహస్ర గృహ ధ్యాన పరిచయ ప్రచార కార్యక్రమాన్ని పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 600 గృహాలలో ధ్యాన కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు ఎం.సుబ్రమణ్యం, డి.ప్రవీణ్‌కుమార్, కె.జయచంద్ర ఆచారి, ధ్యాన సాధకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ





భీమ, దుర్యోధనుల యుద్ధ సన్నివేశం, యుద్ధ సన్నివేశంలో దుర్యోధనుడి వేషధారి

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో వెలసిన శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకలు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం భాగవతారిణిచే ఏర్పాటు చేసిన హరికథా గానం ప్రత్యేకంగా భక్తులను ఆకట్టుకుంది. అనంతరం దుర్యోధన వధ ఘట్టంలో భాగంగా భీమసేనుడు గంగమడుగులో దాక్కున్న దుర్యోధనున్ని బయటకు రప్పించే ఘట్టం చూపరులను ఆకట్టుకుంది. దుర్యోధన పాత్రధారి సత్యరాజ్ తన నటనతో పలువురిని కంటతడి పెట్టించారు. భీమ, దుర్యోధనుల యుద్ధ సన్నివేశం ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం ధర్మరాజుకు పట్టాభిషేకం చేశారు. కంకణం కట్టుకున్న భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి, తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హరిత, ఆలయ కమిటీ సభ్యులు రాజశేఖర్‌నాయుడు, కుప్పయ్య, నారాయణస్వామి నాయుడు, మాధవనాయుడు, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. భాగవతారిణి గానం ఆకట్టుకుంది. సాయంత్రం దుర్యోధన ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. ముందుగా గంగ మడుగులో దాక్కున్న దుర్యోధనున్ని భీమసేనుడు బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధన ప్రతిమ వద్ద సాగిన యుద్ధ సన్నివేశాలు కట్టిపడేశాయి. భీమ, దుర్యోధన వేషధారుల మధ్య ఘట్టాలు ఆసక్తికరంగా సాగాయి. అదేవిధంగా దుర్యోధనుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి. ఈ సన్నివేశాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రావడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది. అనంతరం భీముడు, దుర్యోధనున్ని వధించే సన్నివేశం చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, ఆలయ ధర్మకర్త మురుగేష్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భరత నాట్యంతో అలరిస్తున్న కళాకారులు



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లికి చెందిన కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో భక్తి, జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పాటలకు కళాకారులు రాజేష్, మస్తాన్, లహరి, భరత్, మధుశ్రీ, అనుష్క, చిత్ర, నేహల్య, మధు, లక్షిత, మేఘన, లోకేశ్వరి, ప్రియా, శరత్ కుమార్, హేమంత్, జస్వంత్, సాహిత్, ధరరాజ్, అక్షిత, తేజ, వైష్ణవి, దివ్య, దర్శన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.